## క్లుప్తంగా

### స్వామి సన్నిధిలో ఆర్డీవో దంపతులు



అంతర్వేది ఆలయంలో ఆర్డీవో శ్రీకర్ దంపతులకు స్వామి చిత్రపటం ఇస్తున్న విజయ సారధి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, ఆయన సతీమణి, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారధి, వారికి అందజేశారు.

### ఘనంగా లక్షపత్రి పూజ



జనార్దనస్వామి ఆలయంలో చేసిన లక్షపత్రి పూజ

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య దేవతామూర్తుల విగ్రహాలకు లక్ష తులసి పూజ, విశేషార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక సమారాధన జరిగింది.

### ప్రత్యేక పూజలు

అంబాజీపేట: ముక్కామల గ్రామంలో ఉన్న బాలాత్రిపుర సుందరి సహిత రాఘవేశ్వర స్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. మాచవరంలో పార్వతి రాజరాజేశ్వర స్వామి, కందుల మల్లేశ్వర స్వామికి, సర్వమంగళ పార్వతి సమేత చిన్న మల్లేశ్వరస్వామి, ఉమా సమేత ఆనందేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, లక్ష పత్రి పూజలు జరిగాయి.

### పేదలకు సాయం పంపిణీ



పేదలకు సాయం అందజేస్తున్న సర్పంచ్

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం పంచాయతీ వద్ద నిర్వాహకులు వంద మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.వంద నగదు, ఐదు కేజీల బియ్యం చొప్పున అందజేశారు. గత 13 ఏళ్లుగా ప్రతి నెలా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల సేవా కార్యక్రమాలకు విరాళమిచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, ట్రస్ట్ మెంబర్లు బళ్ల లక్ష్మణరావు, అల్లూరు మధురాజు ఈ సాయాన్ని అందజేశారు.

### హైందవ శంఖారావంపై సమావేశం

కొత్తపేట: హిందూ సంఘటన శక్తిని నిరూపించేందుకు విజయవాడలో జరిగే హైందవ శంఖారావం భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జనవరి ఐదున జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి ఆదివారం సాయంత్రం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో మండల హిందూ సమ్మేళన సమావేశం నిర్వహించారు. మండల ఆహ్వాన కమిటీ కన్వీనర్ కోటిపల్లి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కోనసీమ శాఖ సభ్యులు తొగరు సీతారామాంజనేయులు, వాకాడ శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోట్ల ప్రభాకర విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### శతకవుల సమ్మేళనంలో వీధి దుర్గారావుకు సత్కారం



సత్కారం అందుకుంటున్న వీధిదుర్గారావు

అయినవిల్లి: విజయవాడలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో తెలుగు పోయెట్రీ ఫెస్టివల్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన శతకవుల సమ్మేళనంలో మండలంలోని మాగాం గ్రామానికి చెందిన వీధి దుర్గారావును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన శత కవుల సమ్మేళనంలో వీధి దుర్గారావు.. పంచు ప్రేమించు అనే వచన కవితా పఠనం చేసి పలువురి మన్ననలు పొందారు. అనంతరం పలువురు సాహితీవేత్తల చేతులమీదుగా సత్కారం అందుకున్నారు.

# జీతాలివ్వండి బాబూ..!

సర్కారు బడుల్లోని చిరుద్యోగులు జీతాలందక అవస్థలు పడుతున్నారు. కంటిపై కునుకేయకుండా కాపు కాసినా ఈ ప్రభుత్వానికి కనికరం లేదు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తోంది. వారి కుటుంబ పోషణకూ అప్పులు చేయాల్సిన దుస్థితి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో చిరుద్యోగుల ఆకలి కేకలు వినేవారే కరవయ్యారు.

- ప్రభుత్వ బడుల్లోని ఆయాలు, వాచ్‌మన్లకు అందని జీతాలు
- కుటుంబం గడవక అవస్థలు పడుతున్న చిరుద్యోగులు
- వేతనాల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని పాలకులు

కొత్తపేట, పి గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చిరుద్యోగుల వివరాలు

| నియోజకవర్గం | పాఠశాలలు | ఆయాలు | వాచ్‌మన్లు |
|---|---|---|---|
| కొత్తపేట | 235 | 263 | 34 |
| పి గన్నవరం | 291 | 305 | 43 |
| రాజోలు | 229 | 229 | 33 |
| మొత్తం | 755 | 797 | 110 |



కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాల

కొత్తపేట: ఇక్కడి జెడ్పీ హైస్కూల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో మరుగుదొడ్ల శుభ్రతకు ఇద్దరు ఆయాలను, పాఠశాల రక్షణకు నైట్ వాచ్‌మన్‌ను నియమించారు. వారికి ఈ ఏడాది జూలై నుంచి జీతాలు రావడం లేదు. ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆ చిరుద్యోగులు తమ సమస్యను ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, వాచ్‌మెన్ల పరిస్థితి నెలకొని ఉంది.

గత ప్రభుత్వ హయాంలో నెల మొదట్లోనే పారిశుధ్య కార్మికులకు జీతం చెల్లించేవారు. ఒకవేళ ఏ కారణం చేతైనా ఆ నెల చెలిచకపోతే రెండో నెలలో రెండు నెలల జీతం కలిపి చెల్లించేవారు. ఈసారి కూటమి ప్రభుత్వం వారిని చిన్నచూపు చూస్తోంది. కుటుంబం గడుస్తుందనే ఆశతో పేదలు ఆయాలుగా, వాచ్‌మన్లుగా పనిచేస్తున్నారు. వారు చేసే కష్టాన్ని ఏ మాత్రం గుర్తించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. వారికి ఈ ఏడాది జూలై నుంచి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గతిలేని పరిస్థితిలో విధులు నిర్వహిస్తున్న ఆయా, నైట్ వాచ్‌మన్ల ఆకలికేకలు ప్రభుత్వానికి వినపడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అప్పులు చేసి..**

ఆయాలకు, నైట్ వాచ్‌మెన్లకు నెలవారీగా జీతాలు రూ 6 వేల చొప్పున ఇప్పటి వరకు ఐదు నెలలకు ఒక్కొక్కరి రూ 30 వేలు చెల్లించాల్సి ఉంది. క్లస్టర్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లోని మొత్తం 755 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 907 మంది ఆయాలు, వాచ్‌మన్లుగా పనిచేస్తుండగా, వారికి ఐదు నెలలకు రూ 54.42 లక్షలు వేతనాల రూపంలో చెల్లించాల్సి ఉంది. రెగ్యులర్‌గా జీతాలు ఇవ్వకపోవడంతో వారు కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ వడ్డీలకు అప్పు తీసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని పలువురు వాపోయారు. జీతాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని వారు పాలకులను ప్రశ్నిస్తున్నారు.

**జీతాలు చెల్లించి ఆదుకోవాలి**



పేద కుటుంబాలకు చెందిన మేము కుటుంబ పోషణార్థం పాఠశాలల్లో ఆయాలుగా, నైట్ వాచ్‌మన్లుగా పనిచేస్తున్నాం. ఈ నెలతో ఐదు నెలలకు జీతాలు ఇవ్వక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ నెలలో రాకపోతాయా, రేపు నెలలో రాకపోతాయా అని ఎదురుచూస్తున్నాం. కుటుంబ పోషణకు చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితి గతంలో ఉండేది కాదు. మా దుస్థితిని అర్థం చేసుకుని వెంటనే జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం.

– శీలం మంగమ్మ, ఆయా, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కొత్తపేట

**పెండింగ్‌లో ఉంచడం తగదు**



రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు వారు. పొట్ట కూటి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌న్ల జీతాలను ఐదు నెలలుగా చెల్లించకపోవడం దారుణం. ఈ కొత్త ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం సమంజసం కాదు. జీతాలు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నారు. వెంటనే వారి జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి.

– టి.విజయకృష్ణ, మెంబర్, స్టేట్ ఆడిట్ కమిటీ, యూటీఎఫ్, కొత్తపేట

## హెచ్‌ఐవీ రహిత సమాజమే లక్ష్యం

ఆలమూరు: ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సమష్టి కృషి జరగాలని పలువురు వైద్యాధికారులు కోరారు. స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి పి.గోపిరామ్, చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వద్ద వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి,సాయికిషోర్ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్‌సీల పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది ఆదివారంర్యాలీ, మానవహారం నిర్వహించారు. హెచ్ఐవీని తరిమికొట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదన్నారు. గర్భిణులకు హెచ్‌ఐవీ సోకినా, పిల్లలకు సంక్రమించకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్న వైద్య సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే మండలంలో వివిధ గ్రామాల్లోని సచివాలయాల వద్ద ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు.

**అవగాహనతోనే దూరం**

ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ, నిర్మూలన అనే అంశాలను సంపూర్ణంగా అవగాహన కల్పించడం ద్వారానే ఈ మహమ్మారిని సమాజం నుంచి దూరం చేయవచ్చని ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల వద్ద ఆదివారం రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కొత్తూరు సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహస్వామి, అధ్యాపకులు ఎం.బాలస్వామి, బి.ఆశీష్, రాజా, తేజ , శేఖర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చొప్పెల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

## ఘనంగా చండీ హోమం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం చండీ హోమం ఘనంగా జరిగింది. కార్తిక మాస బహుళ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు భారీ అన్న సమారాధనను ఏర్పాట్లు చేశారు.

## కోకోనట్ మర్చంట్స్ వన సమారాధన

పి.గన్నవరం: పోతవరం గ్రామంలోని కల్యాణ మండపంలో ది సెంట్రల్ డెల్టా కోకోనట్ మర్చంట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని కొబ్బరి వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కల్యాణ మండపం ఆవరణలో ఉన్న ఉసిరిచెట్టు వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, బాలికలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. కార్యక్రమాల్లో అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు కొర్లపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి యడ్లపల్లి కాశీవిశ్వనాథం, కోశాధికారి అప్పన హెచ్‌కేవీ ప్రసాద్‌బాబు, యడ్లపల్లి అర్జునరావు, యడ్లపల్లి మూలాస్వామి, చంటి, అడబాల సత్యనారాయణ, బండారు విజయకుమార్ పాల్గొన్నారు.



పోతవరం కల్యాణ మండపం వద్ద ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

## అంతర్వేదిలో భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: పవిత్రమైన అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. నిత్యం నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో భక్తుల భోజనాలను అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. క్యూలైన్లలో భక్తులకు అసౌకర్యం లేకుండా సిబ్బంది పర్యవేక్షించారు.

**ట్రస్టుకు విరాళం**

దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు విజయనగరానికి చెందిన దాత తిరుమల ప్రసాద్, కృష్ణకాంతి దంపతులు రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారధికి విరాళమిచ్చి, స్వామివారి చిత్రపటాన్ని దాత కుటుంబ సభ్యులు అందుకున్నారు.



అంతర్వేది ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

## విద్యుత్ చార్జీల పెంపు దారుణం

జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



మామిడికుదురు: విద్యుత్ చార్జీలు పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దారుణమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని ఎన్నికల సభలో హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు, కూటమి ప్రధాన నేతలు దానికి విరుద్ధంగా వ్యవహరించడం అప్రజాస్వామికమన్నారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లో రెండు పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. విద్యుత్ చార్జీల పేరిట ప్రజలపై భారం మోపుతూ తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మోసపూరితమైన హామీలతో ప్రజల్ని మోసం చేసిందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం, వైఎస్సార్ సీపీ నేతలపై కక్ష సాధించడం, సోషల్ మీడియా కార్యకర్తలను వేధించడం మినహా కూటమి ప్రభుత్వం ఏం సాధించిందని ప్రశ్నించారు. ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతోందని, ఇసుకను దోచేస్తున్నారని ఆరోపించారు. మద్యం అక్రమ విక్రయాలు, ఇసుక దోపిడీని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితులను కూటమి ప్రభుత్వం కల్పించిందని వేణుగోపాలరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## అగ్ని బాధితులకు ఎమ్మెల్సీ సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అయినవిల్లి: మండలంలోని చింతనలంక గ్రామం జాంబవానిపేటలో అగ్ని ప్రమాదదానికి గురై సర్వం కోల్పోయిన ఏడు కుటుంబాలను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం పరామర్శించారు. ఒకొక్క బాధిత కుటుంబానికి 25 కేజీలు బియ్యం, రెండు రగ్గులు, చీరలు, లుంగీలు, టవళ్లు, బకెట్లు, నిత్యావసర సరకులను ఆయన అందజేశారు. స్థానిక అధికారులతో మాట్లాడి, తక్షణం బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ చింతలపూడి వెంకటరత్నం, ఎంపీటీసీ చల్లాబత్తుల సాయిలక్ష్మి, మల్లిపూడి కోటేశ్వరరావు, సవరపు ఏసుబాబు, ఆకుమర్తి దుర్గారావు, మమ్మిడివరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## గరుడేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



గరుడేశ్వరస్వామికి నిర్వహిస్తున్న పూజలు

పి.గన్నవరం: పవిత్ర కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా ఆదివారం స్థానిక గరుడేశ్వరాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వామి భైరవభొట్ల సత్య వెంకట నారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# ఎడతెరిపి లేని భారీ వర్షం

- నిండా మునిగిన పొలాలు
- పడిపోయిన వరి చేలు



కె.పెదపూడిలో ఈదురు గాలులు, భారీ వర్షానికి నేలకొరిగిన వరి చేలు

మామిడికుదురు: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో ఫెంగల్ తుపాను కారణంగా రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం రైతులను నిండా ముంచింది. ఈదురు గాలులు, భారీ వర్షానికి పలు గ్రామాల్లో పంట నేల కొరిగింది. భారీ వర్షానికి పంట ముంపునకు గురి కావడంతో, ధాన్యం రాలిపోయి మొలక వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడికుదురు, నగరం, గెద్దాడ, మొగలికుదురు, పెదపట్నం, పాశర్లపూడి గ్రామాల పరిధిలో ఈదురు గాలులలకు పంట చేలు దెబ్బతిన్నాయి. వర్షం ఇంతటితో తగ్గితే గట్టెక్కినట్టేనని చెబుతున్నారు. కానీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రైతుల్లో కలవరం మొదలైంది. ప్రతి ఏడాది ఇదే పరిస్థితని, ఎంతో కష్టపడి సాగు చేసే ఖరీఫ్ పంట దిగుబడి చేతికి దక్కే వరకు భయం భయంగానే ఉంటుందని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేయడం, తర్వాత దాన్ని ఒబ్బిడి చేసి సొమ్ము చేయడం కష్టంగా మారుతోందని చెబుతున్నారు. భారీ వర్షాల ప్రభావంతో పాశర్లపూడి, మామిడికుదురు, నగరం గ్రామాల్లో 216వ నంబర్ జాతీయ రహదారిపై పలుచోట్ల భారీగా వర్షం నీరు నిలిచి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లోని కాలనీలను వర్షపు నీరు ముంచెత్తింది.

**రైతులను వణికిస్తున్న వర్షం**

అంబాజీపేట: తుపాను కారణంగా మండలంలో రైతులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం. మండలంలో 16 గ్రామాల పరిధిలో సార్వా సీజన్లో సుమారు 3,009 ఎకరాల్లో వరినాట్లు వేశారు. ప్రస్తుతం మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో శుక్రవారం సాయంత్రం నుంచి చెదురు మదురు వర్షం కారణంగా రైతులు ఇప్పటికే గట్టుకు చేర్చిన ధాన్యాన్ని.. వర్షం బారి నుంచి కాపాడుకోడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కోత యంత్రాలతో ఒబ్బిడి చేసిన ధాన్యంలో నెంబు ఎక్కువగా ఉండడంతో తక్షణం ఎండబెట్టాల్సి ఉంటుంది. ధాన్యంలో తేమశాతం తగ్గేవరకు ఎండబెట్టకపోతే గింజలు రంగుమారి ముక్కపాయగా మారిపోతాయి. ఈ ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. గత నాలుగైదు రోజులుగా గట్టుకు చేర్చిన ధాన్యాన్ని రైతులు రోడ్ల వెంబడి, ఖాళీ ప్రదేశాల్లో ఎండబెడుతున్నారు. ఇటువంటి తరుణంలో శుక్రవారం సాయంత్రం నుంచి కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురువగా, శని, ఆదివారాల్లో భారీ వర్షం పడింది. దీంతో గట్టుకు చేర్చిన ధాన్యం తడిసిపోకుండా బరకాలు కప్పుతున్నారు. రెండు రోజుల పాటు తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యాన్ని బరకాలతో కప్పి ఉంచితే రంగుమారి ముక్కపాయ వచ్చే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల వర్షం, పెను గాలుల కారణంగా చేను సుడులు తిగిరి పడిపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపడమేగాక, పడిపోయిన పంటను మాసూళ్లు చేయడానికి ఎక్కువ ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు వాతవరణం ఇలాగే ఉంటే తీవ్ర నష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**జన జీవనం అస్తవ్యస్తం**

ఆలమూరు: ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలో జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వ్యవసాయ, భవన నిర్మాణ, ఇటుక బట్టీ కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇప్పుడే మసూళ్లు చేపట్టిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. మండలంలో సుమారు 30 శాతం మంది రైతులు తమ వరి పంట ధాన్యం కళ్లాలపైనే ఉండిపోయింది. రహదారులపై పండించిన ధాన్యాన్ని బరకాలు కప్పి ఉంచారు. వర్షం తీవ్రంగా ఉంటే ధాన్యం దెబ్బతినే ప్రమాదముదని రైతులు ఆందోళన చెందుతున్నారు, ఏకధాటి వర్షాలకు పుంత రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు తమ పంట ఉత్పత్తులను తరలించేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. వివిధ గ్రామాల్లో వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాలతో రహదారులు ఛిద్రం అవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో జన సంచారం గణనీయంగా తగ్గింది.

**ఉపాధి కోల్పోయిన కార్మికులు**

శీతాకాలం కావడంతో వలస కార్మికులు ఇటుక బట్టీల్లో పనులు చురుగ్గా ప్రారంభించారు. తుపాను ప్రభావంతో కార్మికులు రోడ్డున పడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పది రోజుల పాటు బట్టీలు తెరిచే పరిస్థితి కనిపించడం లేదు. నర్సరీల్లో పని చేసే మహిళలకూ పనులు లేకుండా పోయాయి.

**భయాందోళనలో ప్రజలు**

అంబాజీపేట: ఫెంగల్ తుపాను కారణంగా మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఈదురు గాలులు, భారీ వర్షంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం వేకువజాము నుండి ఎడతెరిపి లేని భారీ వర్షం కురవడంతో ప్రధాన సెంటర్లు వెలవెలబోయాయి. షాపులు, చిరు వ్యాపారులు తమ దుకాణాలను మూసేశారు. అత్యవసర పనులుంటే మినహా జనం బయటకు రాలేదు. కె.పెదపూడి, పుల్లేటికుర్రు, అంబాజీపేట ప్రధాన రహదార్లు వర్షపు నీటితో నిండిపోయాయి. మార్కెట్‌కు వచ్చే అరటి రైతులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్ స్టేషన్, అంబాజీపేట, పుల్లేటికుర్రులలో ఉన్న జెడ్పీ హైస్కూళ్లు వర్షపు నీటితో నిండిపోయాయి.

**వర్షాలతో రైతుల బెంబేలు**

పి.గన్నవరం: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మండలంలోని వరి చేలు నీటిలో నానుతున్నాయి. పలుచోట్ల వరిచేలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల వల్ల నేలకొరిగిన చేలల్లో ధాన్యం రంగుమారి నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

### నేలనంటిన వరి చేలు



శానపల్లిలంకలో నేలనంటిన వరి చేలు

అయినవిల్లి: తుపాను కారణంగా వీచిన ఈదురు గాలులు, భారీ వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో వరిచేలు నేలనంటాయి. కోత దశలోనే తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. పది శాతం వరిచేలు మాత్రమే యంత్రాలతో కోతలు కోసి ఆరబెట్టామని, 90 శాతం పంట నేలనంటిందని వారు చెబుతున్నారు. ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాన్ల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని అంటున్నారు. మండలంలోని అయినవిల్లి, వెలువలపల్లి, చింతనలంక, మడుపల్లి, నేదునూరు, నల్లచెరువు, ఎస్.పెదపాలెం, శానపల్లిలంక తదితర గ్రామాల్లో వరిచేలు నేలనంటాయి.



మామిడికుదురులో ముంపునకు గురైన పంట



మామిడికుదురులో జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు



ఆలమూరులో మూతపడిన ఇటుక బట్టీ



అంబాజీపేటలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం



పి.గన్నవరం మండలం జి.పెదపూడిలో నేలకొరిగిన వరిచేలు